# కలవని తీరాలు

★

రచన : ఋషిశ్రీ కోరా



అది రాత్రి సమయము. నాలుగు అంతస్తుల భవనము ముందున్న ఆ తోట తరూలతా పుష్ప సమూహాలతో వికశించుచున్నది. గులాబీలు, జాజి, సంపంగి, మల్లెలు మొదలగు సుగంధ పుష్పములు విరబూసి పిల్ల గాలికి పరిమళములతో గుభాళించుచూ మత్కోకించుచున్నది.

గులాబి రంగు చీర కట్టి, అదేరంగు జాకెట్టు వేసుకొని, తలలో మల్లెలు దురిమి, దివినుండి భువికి దిగివచ్చిన దేవకన్యలా ఉన్న ఆమె ఆ తోటలో మెల్లగా అటునిటు తిరుగాడుచున్నది. ఎవరిరాక కొరకో నిరీక్షిస్తూ భయాందోళనలతో మధన పడుతూ ఉన్నది.

భారతి నాగభూషణంగారి ఆస్తి కంతటికీ వారసురాలు, ఒక్కగా నొక్క కూతురు. తల్లి లేకపోయినా ఏ లోటూ లేకుండా పెంచారు నాగభూషణంగారు. భారతి. బి. ఏ. ఫైనల్ ఇయర్ చదువుతూంది.

భాస్కర్ కూడా అదే కాలేజీలో బి. ఏ. ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతనికి 'నా' అనే వాళ్ళు ఎవరూ లేరు అతని చెల్లెలు సరోజ తప్ప. తండ్రి కూడా చనిపోవటం చేత ఆమె చదువు ఇంటర్ మిడియట్ తో ఆపవలసి వచ్చింది. ఆస్తి విషయాని కొస్తే రెండెకరాలు మిట్టపొలం ఉన్నది. అదీ సరి అయినది కాదు. భాస్కర్, భారతీ ప్రేమించుకున్నారు. భారతి వదినగా రావటం తన అదృష్టంగా భావిస్తోంది సరోజ.

పరీక్షలు అయినాయి. ఫలితాలు తెలిసాయి. ఇద్దరూ ఉత్తీర్ణులు అయినారు. "కాలేజీ ఫస్ట్ వచ్చినందుకు కంగ్రాచు లేషన్సు భాస్కర్". "థాంక్స్ భారతీ". "ఈ శుభ సమయంలో మీకొక శుభవార్త". "ఏమిటో అది?" "మిమ్మల్ని రేపు మా నాన్నగార్కి పరిచయం

చేయబోతున్నాను. "రియల్లీ! ఆశ్చర్యంగా చూశాడు భాస్కర్". "అవునన్నట్లు తలూపింది భారతి". అయితే రేపు మన ప్రోగ్రాం ఏమిటో సెల వివ్వండి రాణీగారూ అంటూ చిలిపిగా అడిగాడు భాస్కర్. "ఏముంటుంది? రేపు సాయంత్రం ఎగ్జాట్లీ ఫైవ్ ఓ క్లాక్‌కు ఇదే పార్కులో కలుసుకుంటాం. "ఊ, ఆతరువాత?" ఫైవ్ థర్టీ కల్లా మీరు మా నాన్నగారికి మిమ్మల్ని పరిచయం చేస్తాను. "ఆ తరువాత?" మీ యింటికి ఓ శుభలేఖ వస్తుంది త్వరలో "ఊ! ఆ తరువాత?" "ఛీ పొండి. సిగ్గుతో తలవంచుకుంది భారతి". ఆ! తొమ్మిది అవవస్తుంది. నాన్నగారు ఎదురు చూస్తుంటారు. ఇక గుడ్‌నైట్. "ఓ. కె." అన్నాడు భాస్కర్.

♦ ♦ ♦

నాన్న! నేను చెప్పిన భాస్కర్ వీరే. బి.ఏ. కాలేజీ ఫస్ట్ వచ్చారు. "నమస్కారమండీ" అని అన్నాడు భాస్కర్. "ఆ! కూర్చో". "మీరు మాట్లాడుతూ ఉండండి. నేను ఇపుడే వస్తానంటూ" కాఫీ కలపటాని కెళ్ళింది భారతి.

"మీ తల్లిదండ్రులు ఏం చేస్తుంటారు? లేరండినాకు 'నా' అన్న వారెవరయినా ఉంటే నా చెల్లెలు సరోజ ఒకతేనండి." ఆస్తి? ఓ రెండెకరాలు మిట్ట ఉందండి. ఇల్లు? "లేదు". మీ చెల్లెలికి వివాహ మయ్యిందా? లేదండి. ఒక ఎకరం అమ్మి దాని పెండ్లి చేయాలనుకుంటున్నాను.

కాఫీలు తీసుకోండి. అంటూ కాఫీలు అందించింది భారతి. ఆ! ఇక వెళ్ళొస్తానండీ. మంచిది బాబూ భారతీ వెళ్ళొస్తా. సంతోషంగా ఇంటి ముఖం పట్టాడు భాస్కర్.

భారతి కన్నులు అశ్రుపూరితాలైనాయి. ఆమె తండ్రి కంఠం గద్దిస్తోంది. మన కులం కాదని తగని కులంలో కలసి నా పరువు, ప్రతిష్టలు నాశనం చేయాలనుకుంటున్నావా? బి. ఏ. వెలగబెట్టువే! నీ జ్ఞానమంతా ఏమైంది?

"నాన్నా? నేను అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను". ఛీ! ఆ మాట అనటానికి సిగ్గు లేదూ? సిగ్గెందుకు నాన్నా? మనిషి అన్న తరువాత ఎవరినో ఒకర్ని పెండ్లి చేసుకోవాలి కదా? ఆ చేసుకొనేది నేను కోరుకున్న వాడు, నాకు నచ్చిన వాడూ, నా మనసును అర్థం చేసుకున్న వాడూ అయితే నా జీవితం సుఖమయమవుతుంది. మంచితనం కావాలి గానీ కులంతో పని ఏముంది నాన్నా! మంచి కావాలి కానీ ఆచారాలతో పని ఏముంది? ఆచారాలను మంచి కొరకు మార్చుకోవచ్చు నాన్నా? ఇక ఆస్తి అంటారా? దాని దేముంది. ఇవాళ వస్తుంది, రేపు పోతుంది అతను బి. ఏ. ఫస్టున పాస్ అయ్యాడు. మంచి ఉద్యోగం వస్తుంది. నన్ను పోషించనూ గలడు. కలసి పోయిన మా హృదయాలను కులం, ఆస్తి. అంతస్తుల పేరుతో విడదీయకండి. నా జీవితాన్ని నాశనం చేయకండి. నా కోర్కెను అంగీకరించండి నాన్నా! తండ్రిని అంగీకరింప చేయాలని వల వల రోదిస్తూనే సాధ్యమైనంత వరకూ ప్రార్థించింది.

"నీవు నాకు నీతులు నేర్పేటంతటి దాని వయ్యావన్నమాట. నీ యిష్టప్రకారమైతే నీ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకో. నీ రక్త సంబంధం, బంధు వర్గము నీ వారు కాదనుకో! చిన్న దానివి. యవ్వనపు ఉద్రేకంలో బంగారు భవిష్యత్తును నీ చేతులారా పాడు చేసుకోకు.

సంఘంలో నీకున్న విలువ, ప్రతిష్ట ఇక ముందు, నీకూ నీ బిడ్డలకూ ఉండవు.... ఏకాకిగా ఉండ దలచుకుంటే నీ యిష్టం. నా ప్రాణం పోయినా ఈ పెండ్లికి నే నంగీకరించను". అతని గొంతు గర్జించింది. భారతి ప్రయత్నం వ్యర్థమైంది.

ఇంకొక వారంలో బావకూ, నీకూ పెండ్లి జరిగి తీరుతుంది. ఇది నా నిశ్చయం. దీనికిక తిరుగు లేదు. "నాన్నా!......" అక్కడి నుంచి వెళ్ళారు నాగభూషణంగారు.

సరోజా! మీ అన్నయ్య ఉన్నారా? లేరు వదినా, కూర్చో ఇపుడే వస్తాడు. కూరగాయలకు వెళ్ళారు. ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్న భారతిని చూసి "ఏం, వదినా, అలా ఉన్నావు?" అని అడిగింది సరోజ.

ఆమె కనిన కలలు స్మరణకు వచ్చి మనోహరంగానూ, ఆనంద భరితంగానూ గడిపిన రోజులను ఇలాగే జీవితాంతం పొందాలనే పట్టుదల ఎక్కువయింది. నేత్రాలు తీవ్రములైనాయి. "మీ అన్నయ్యతో మాట్లాడాలి సరోజా" ముక్తసరిగా చెప్పింది భారతి.

భాస్కర్ వస్తూనే "గుడ్ ఈవెనింగ్ భారతీ" అంటూ, అలా నిలబడుతావే? కాఫీ తీసుకురావే మొద్దూ అంటూ చెల్లెన్ని ముద్దుగా గదిమాడు.

"శ్రీ బాలసుబ్రహ్మణ్యం"

IS. 325

పంపులు-మోటార్లు

BMF

శ్రేష్ఠమైన లోహాలతో పనితనంలో అనుభవంగల నిపుణలచే తయారుచేస్తున్నాము.



విశేషాంశాలు

- స్వల్ప విద్యుచ్ఛక్తితో అధికంగా మంచి నీళ్ళు.
- ఎక్కువ కాలం మన్నికకు నమ్మకమైనది.
- నిశ్శబ్దంగా పరుగు.
- శ్రేష్ఠమైన తయారింపు.
- ఖర్చులో తక్కువ.

: తయారించువారు :

బాలసుబ్రహ్మణ్యా ఫౌండరి

పటేల్ రోడ్ (Phone No. 24313) కోయంబత్తూరు - 641 009.

ఆంధ్రప్రదేశ్ ఏజెంట్లు :—

అసోసియేటెడ్ ట్రేడర్స్ (డక్కన్) నెం. 8570-2 రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ (ఎ.పి.)

"ఇదీ సంగతి. ఇపుడేమి చేయాలో తోచటం లేదు బాస్కర్. వారి నేత్రాలు అశ్రుభరితాలై ఉన్నాయి. భాస్కర్! నీకూ, నీ చెల్లెలికీ అభ్యంతరం లేకపోతే మనం రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం. నాకిష్టమే భారతీ సరోజా! నీ అభిప్రాయం ఏమిటి? భారతి వదినగా రావటం నా అదృష్టంగా భావిస్తున్నానన్నయ్యా.

భారతి, నీవు బాగా ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చావా. భాస్కర్! నా మనసు నీకు తెలియదా? మనం కట్టుకున్న మేడలు గాలి మేడలు కాగూడదు. మన కలలు నిజాలు కావాలి.

భారతీ! నేనా నిరుద్యోగిని. ఆస్తి అంతగా లేని వాడిని. మీ అంతస్తుకు తగినవాడికి నిన్నిచ్చి చేయాలని మీ నాన్న కలలు కంటున్నాడు. కన్న తండ్రిగా అతను అలా అనుకోవటంలో తప్పు లేదు.

అసంభవం. కల్లో కూడా నేను వేరొకరిని పెండ్లి చేసుకోవటం జరగదు. "జరిగితే"? జీవితాంతం ఏడ్వలేక చచ్చిపోతాను.

భారతీ! నీలాంటి సుగుణాల రాశి నా భార్య కావటం ఎంత అదృష్టమో?

"మీరిలాగే కవితలల్లుతూ ఉండండి. మా నాన్నగారు నన్ను వేరొకరిచ్చి పెండ్లి చేస్తారు."

అయితే ప్రస్తుత కర్తవ్యం?

రేపు రాత్రికి సరోజ, మీరు, నేను హైదరాబాబు వెళ్ళాలి. ఎందుకూ? ఎందుకేమిటి! అక్కడ మా ఫ్రెండ్ జయ ఉంది. వాళ్ళ నాన్నగారికి పెద్ద ఫాక్టరీ ఉంది. నేను అడిగితే జయ మీకు తప్పకుండా ఉద్యోగం ఇప్పిస్తుంది ఆ తరువాత మన మారేజ్, రేపు రాత్రికి మా తోటలోకి నైన్ కల్లా రావాలి సుమా! నేను రెడీ అయ్యి మీ కోసం ఎదురు చూస్తుంటాను. ఓకె అన్నాడు భాస్కర్.

పదకొండు అవవస్తుంది భాస్కర్ ఇంకా రాలేదు. భారతి హృదయం ఆలోచనలతో నిండివుంది. అతను రాడేమో! నన్ను మోసం చేశాడా! ఛ... బాస్కర్ అలాంటి వాడు కాదు. ఏదో బలవత్తరమైన కారణ ముండి రాలేక పోయుంటాడు.

ఆలోచనలను చీల్చుతూ ఎదురుగా టార్చి లైటుతో వస్తున్న వ్యక్తి కనిపించాడు. వేయి కండ్లతో అతనిరాకకై నిరీక్షిస్తున్న భారతి హృదయం ఆనందపారవశ్యంతో ఓలలాడుతుంది.

కాని అతను బాస్కర్ కాదు. తోటమాలి రంగయ్య. ఏందమ్మాయి గారూ, ఇంత రాత్రి వేళ ఇక్కడున్నారు. ఏం లేదు రంగయ్యా! పైన నిద్రపట్టకపోతే అలా చల్లగాలిలో తిరుగుదామని వచ్చాను. రంగయ్య ఈజీఛెయిర్ తీసుకొచ్చి వేశాడు. అందులో పడుకొని బాస్కర్ రాకకొరకు ఎదురుచూసి, ఎదురుచూసి నిద్రపోయింది.

ఉదయం ఆరు గం॥కే లేచి గబగబా ముఖం కడుకొని బాస్కర్ ఇంటి కెళ్ళింది భారతి. అరే! తాళం వేసి వుంది? భారతికి దుఃఖం పొంగి పొరలింది. ప్రక్కనున్న వారిని అడిగింది రాత్రి ఏడు గం॥కే వాళ్ళు ఈ ఊరు వదలి వేరొక ఊరు వెళ్ళారని చెప్పారు, నిన్న సాయంత్రం ఎవరైనా వచ్చారా? అని అడిగింది. మీ నాన్నగారు వచ్చి చాలాసేపు ఏదో మాట్లాడారు అమ్మా అని ఇంకా ఏమో చెప్పబోతుంటే "వద్దు నాకు తెలుసు, ఇంకేమి చెప్పకండి" అంటూ ఇల్లు చేరింది. భారంగా సోఫాపై ఒరిగింది.

ఉదయం ఎనిమిది అయ్యింది భారతి ఇంకా లేవలేదు, నాగభూషణంగారొచ్చి లేఅమ్మా! ఎనిమిదయ్యింది, అంటూ చెయ్యి పట్టుకున్నారు. అంతే! ప్రేమించిన వ్యక్తిని పొందలేక భారతి, కుమార్తె చనిపోయిందన్న షాక్ వల్ల నాగభూషంగారూ ఈ లోకం నుంచి శాశ్వతంగా నిష్క్రమించారు——